


# శత్రువులు

**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

ఒక సెప్టెంబర్ రాత్రి తొమ్మిదిన్నరకు, డాక్టర్ కిరిలోవ్‌గారి ఏకైక సంతానం, ఆరేళ్ల ఆంద్రె గొంతువాపు వ్యాధితో శ్వాస విడిచాడు. పుత్రశోకంతో తల్లితండ్రులు విలవిలలాడుతున్న ఆ క్షణాన డోర్‌బెల్ మోగింది.

గొంతువాపు వ్యాధి కారణంగా పనిమనుషులందర్నీ ఆ వుదయమే పంపించివేశారు. కిరిలోవ్ స్వయంగా వెళ్లి తలుపు తీశాడు. తల చెదిరి ఉన్నది. వెయిస్ట్ కోట్ బటన్ పెట్టుకోలేదు. కార్బాలిక్ ఆసిడ్‌తో కడిగిన చేతులవుంట చల్లారలేదు.

హాల్లో, మసకచీకటిలో నిల్చున్న ఆగంతకుడు "డాక్టరుగారున్నారా?" అంటూ అడిగాడు. గొంతులో ఆదుర్దా వున్నది.

"నేనే డాక్టర్ని."

"రక్షించారు!" అప్పటికే గండం గట్టెక్కినట్టుగా వుందతడికి, "నా పేరు అబోజిన్. గుర్తున్నానో లేదో... ఒకసారి మనం గ్రూచెవ్‌గారింట్లో కలిశాం. తక్షణం మీరు నా వెంట రావాలి. నా భార్య చావు బతుకుల్లో వుంది. బైట బగ్గీ వెయిట్ చేస్తున్నది."

మొహంలో, స్వరంలో ఆందోళన వున్నది. శ్వాస తీసుకోలేక రొప్పుతున్నాడు. మాట తడబడుతున్నది. డాక్టర్ని వెంట తీసుకు పోలేకపోతే ఎలాగన్న భయం వున్నది. ఇంప్రెస్ చేస్తున్నాననుకుని అనవసరంగా మాట్లాడారు.

"మీరింట్లో వుండరేమోనని భయం వేసింది. దార్లో ఎంత భయపడ్డాననుకున్నారు? త్వరగా డ్రెస్ చేసుకొని పదండి, అసలేమైందంటే... అలెగ్జాండర్ వచ్చాడు. పిచ్చాపాటీ మాట్లాడుతూ కూర్చున్నాం. నా భార్య సడెన్‌గా ఛాతీ పట్టుకుని కేకేసి కుర్చీలో వాలిపోయింది. ఏదోలాగ, తీసికెళ్లి మంచంమీద వడుకోబెట్టాం. కానీ ఏం తెలుసని చికిత్స చెయ్యగలను? లిక్విడ్ అమ్మోనియా రాసి కాసేపు కణతలు రుద్దాను. మొహంమీద నీళ్లు చిలకరించాను. చలనం లేకుండా పడుకొంటే శ్వాసాడుతుందా లేదా అని అనుమానం వచ్చింది. రక్తనాళాలు చిట్లాయేమోనని కూడా అనుకున్నాను. పదండి, త్వరగా. ఆమె తండ్రి కూడా అలాగే మరణించాడు."

అతడు మాట్లాడే రష్యన్ భాష అర్థంకానట్టుగా విన్నాడు కిరిలోవ్. అబోజిన్ చెప్పిందే చెబుతున్నాడు. మాట మాటకూ 'పదండి, త్వరగా' అంటున్నాడు.

"సారీ! నేను రాలేనండి. అయిదు నిముషాల క్రితమే నా కొడుకు చనిపోయాడు."

"అయ్యయ్యో. ఎంత ఘోరం జరిగిపోయింది! ఈరోజే మీకింత కష్టం రావాలా? ప్చ్..." మాటలు రావడం లేదు.

అబోజిన్‌కు ఏం చెయ్యాలో తోచలేదు. వెళ్లాలా, డాక్టర్ని మరింత అభ్యర్థించాలా?

కిరిలోవ్ చెయ్యి పట్టుకుని, "డాక్టరు గారూ, మీ బాధ ఎవరూ తీర్చలేనిది. మీరు స్వయంగా ఇంత దుఃఖంలో వున్నప్పుడు, రమ్మని అడగటానికి సిగ్గేస్తున్నది. నన్నేం చెయ్యమంటారో మీరే చెప్పండి. ఈ

చుట్టుపక్కల వేరే డాక్టరు కూడా లేడాయె. నా కోసం కాదు, మరణశయ్య మీదున్న నా భార్య [illegible] అడుగుతున్నాను" అన్నాడు. ఆ తర్వాత వెనుదిరిగి శిలాప్రతిమలా నిల్చుండిపోయాడు.



కిరిలోవ్ యాంత్రికంగా మరో గదిలోకి నడిచాడు. ఆ క్షణాన అతడిలో ఏ ఆలోచనలూ లేవు. అంతటా శూన్యం. హాల్లో ఒకతను తన కోసం నిరీక్షిస్తున్నాడన్న వూహాకూడా లేదు. తనకు తనే ఒక విచిత్ర వ్యక్తి. ఈ ఇల్లెవరిది? ఈ మనుషులెవరు? అంతా కొత్తగా, మొదటిసారి చూస్తున్నట్టుగా వుంది. తలుపు లెక్కడున్నాయో తెలియదు. ఏ వస్తువెక్కడుందో తెలియదు. తప్పతాగి తన ఇల్లనుకుని మరెవరింటి తలుపో తట్టినట్టుగా వుంది.

ఈథర్, కార్బాలిక్ యాసిడ్ కలసినవాసన ముక్కుపుటాలు పగలకొడుతున్నది. పుస్తకాల షెల్ఫులమీద సన్నటి వెలుగుతెరలు పడుతున్నాయి. కాసేపు వాలుకుర్చీలో కూర్చుని పడక గదిలోకి వెళ్లాడు.

అక్కడా మృత్యునిశ్శబ్దం. ప్రాణం రక్షించడానికి చివరి క్షణందాకా ప్రయత్నించి ప్రయత్నించి అలసిపోయాడు. ఇప్పుడిక దీర్ఘ విశ్రాంతి. టేబుల్‌మీద కొవ్వొత్తి చుట్టూ ఏవేవో బాటిల్స్, సీసాలు, జాడీలు. పెద్దదీపం వెలుగులో మందులపెట్టె. పడకమీద కళ్లు తెరుచుకొని ఆశ్చర్యంగా లోకాన్ని చూస్తున్న ఆరేళ్ల ఆండ్రె. శరీరంలో చలనం లేదుగానీ కళ్లు ఇంకా ఏదో చెబుతున్నట్టుగానే వున్నాయి. కొడుకుమీద పడి మూర్ఛపోయిన తల్లి. ఆమెలో కూడా చలనం లేదుగానీ లోపల ఇంకా ప్రాణం వున్నదని తెలుసు. గదినిండా బ్లాంకెట్లు, తువ్వాళ్లు, బేసిన్‌లు, బ్రష్షులు చెంచాలు చెల్లాచెదురుగా పడి వున్నాయి.

మంచందగ్గిరకు వెళ్లి పరిశీలించాడు. నిశ్చేతనంగా భార్య, కొడుకు. కెరిలోవ్ మొహంలో ఏ భావమూ లేదు. చెంపలమీద ఎండిపోయిన కన్నీరు.

చావు అనగానే మన మూహించుకొనే వికృత, భయానక వాతావరణమేమీ లేదక్కడ. ఆ తల్లి మంచంమీద వాలిన వద్దతిలో, ఏ వుద్రేకమూ కనిపించని ఆ తండ్రి మొహంలో గుండెల్ని పిండేసేతనం మాత్రం వుంది. గదినిండా వ్యాపించిన ఆ విషాద సౌందర్యాన్ని రచయితలు పదాల్లో పట్టుకోవటం కష్టం. బహుశా, సంగీతం ఆ పని చెయ్యగలదేమో. నిశ్శబ్దంలో కూడా ఓ వింతశోభ వుంది. ఆ భార్యాభర్తలు మాట్లాడుకొని క్షణాలలోనే కవితాఝరి ప్రవహించింది. వయసుమీద పడింది. ఇంక పిల్లల్ని కనలేరు.

డాక్టరు అక్కడ నిలుచోలేక గదినించి గదికి కలియతిరిగాడు.

హాల్లో వచ్చిన ఆగంతకుడింకా పోలేదు.


"పదండి, ప్లీజ్."

"చెప్పానుగదండీ, రాలేను. నా పరిస్థితి చూస్తూ కూడా ఎలా అడుగుతున్నారండీ?"

"డాక్టరుగారూ, మీ పరిస్థితికి గుండె తరుక్కుపోతున్నది. నా బాధ ఎలా చెప్పమంటారు. రమ్మంటున్నది నాకోసం కాదు. మీరు రాకపోతే ఆమె చావటం ఖాయం. ఆమె ఎంతో అమాయకురాలు. నా ప్రాణానికి ప్రాణం. ఆలస్యం చేసిన ప్రతిక్షణమూ ఆమె మృత్యువుకు దగ్గరవుతున్నది."

"రాను. మీరు వెళ్లిపోండిక."

"మీ బాధ నాకు తెలుసు. జలుబు చేసింది. మందివ్వండి అని అడగటానికి రాలేదు. మరొక్క మనిషి ప్రాణం కాపాడమని ప్రాధేయపడుతున్నాను. ప్రాణం రక్షించడం మీ వృత్తి బాధ్యత. ఒక మృత్యువుతో మొత్తం మానవజాతిపట్ల బాధ్యతనే మీరు విస్మరించారా?"



"అయ్యా, నన్నెందుకలా చిత్రవధ చేస్తున్నారు? నేను నిల్చోలేను. కూర్చోలేను. ఆలోచించలేను. నేను వచ్చినా కూడా నావల్ల మీకేదీ వుపయోగం వుండదు. పైగా, ఈ పరిస్థితుల్లో నా భార్యను ఒంటరిగా వదిలి ఎలా రాగలను?"

అబోజిన్‌ను వెళ్లిపొమ్మని చేతులు విదిలించాడు కిరిలోవ్. "వృత్తిధర్మం నాకు బోధించకండి. నన్ను బరబరా ఈడ్చుకుపోయే హక్కు మీకుండొచ్చు. ఈడ్చుకెళ్లండి మరి. మహాశయా! ఇంక నాకు మాట్లాడే ఓపిక కూడా లేదు, సారీ!"

"ఎందుకంత కోపం డాక్టర్? మీకు బాధ్యతలు గుర్తుచేసేటంత వాడినా నేను. రానన్న మనిషిని బలవంతంగా ఎందుకు తీసుకుపోతానండి, కర్తవ్యం గురించి మాట్లాడను. ఎంత బాధలోనూ మనిషికి కరుణ, దయలాంటివి వుంటాయండి. మీకు కనికరం వుంటే ఓ అమాయకురాల్ని బతికించండి. మీ ఇంట్లో జరిగిన ఘోరమే మరో ఇంట్లో జరగకూడదని మీరు నిజంగా కోరుకోవటం లేదూ!"

అబోజిన్ గొంతులో తెగింపు వున్నది. బాధా తీవ్రత వున్నది. కానీ ప్రవర్తనలో, వ్యక్తిత్వంలోనే ఏదో కృత్రిమత్వం వుంది. మృత్యు సన్నిధిలో పరాచికాలు ఆడుతున్నట్టుగా వుంది. మరణశయ్య మీద వున్న భార్య కూడా ఇతడు తనను అవహేళన చేస్తున్నాడనే అనుకుని వుంటుంది. కానీ మాటల్లో ఏముందిలెండి. మాటల్ని పట్టించుకునే వాళ్లంతా నిజానికి మనిషి బాధను గమనించలేని వాళ్లే. గొప్ప ఆనందమూ, గొప్ప విషాదమూ వ్యక్తమయ్యేది నిశ్శబ్దంలోనే. ప్రేమికులకు మాటలెందుకు? సామీప్యమే సరిపోదా!

## నా కాళ్ల మీదే నిలబడతా!

అంటూంది బాలీవుడ్ నటి సారిక. బాలనటిగా రంగంలోకి వచ్చిన సారిక కమలహాసన్ భార్య. ప్రస్తుతం విడిపోయారు. తన ఇద్దరు కుమార్తెల కోసం. నలభైల్లో వున్న సారిక మళ్లీ నటించటానికి ముందుకొచ్చింది. నెలనెలా రు. 80,000/లకు కమలహాసన్ పంపుతున్న చెక్కులను తిరస్కరించింది సారిక. "కమలహాసన్‌తో కూడా నటిస్తారా?" అనెవరో అడిగితే, "ఎందుకు నటించనూ? అతను దేశంలోనే అందరి కన్నా మంచి నటుడు" అందట. ఇదేమిటో మరి?

చచ్చినప్పుడు ఎవరెవరో వచ్చి శోకాలు పెట్టి ఏడుస్తారు. అదెంత కృత్రిమంగా వుంటుందో తెలియదా? ఆ చచ్చిన మనిషి భార్యా, పిల్లలు మాత్రం నిశ్చేష్టులై కూలబడిపోతారు.

కిరిలోవ్ ఏ జవాబూ చెప్పకుండా నిల్చున్నాడు. అబోజిన్ కర్తవ్యాన్ని గురించీ, వైద్యవృత్తి పవిత్రత గురించీ, ఆత్మ త్యాగాన్ని గురించీ మాట్లాడుతూనే వున్నాడు.

సడెన్‌గా కిరిలోవ్, "ఎంత దూరం?" అన్నాడు.

"మరీ దగ్గిరేం కాదు. కానీ నా గుర్రాలు మంచివి. బాగా దౌడు తీస్తాయి. గంటసేపట్లో వెళ్లి వచ్చేయవచ్చు."

కిరిలోవ్ నిర్ణయానికి సాయం చేసింది, ఆ 'గంటలో రావచ్చు' అనే మాట.

"పదండి."

చీకటిలో బగ్గీ పరిగెత్తింది.

"డాక్టరుగారూ, మీ రుణం వుంచుకోను.."

గాలికి దట్టమైన చెట్లు కదులుతున్నాయి. నిద్రాభంగమైన కాకుల అరుపులు.

"మృత్యుముఖంలో తప్ప మనుషుల్ని మనం నిజంగా ప్రేమించలేమా, డాక్టర్?" అంటూ ధర్మసందేహం లేవదీశారు అబోజిన్.

ఆలోచనల్లో మునిగిన కిరిలోవ్, మాటలకు ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చాడు.

"బగ్గీ వెనక్కి తిప్పండి. నా భార్య ఒక్కత్తే వుంది. నేను వెళ్లాలి. మరోసారి మీదగ్గరకు వస్తాను." అంటూ అభ్యర్థించాడు.

అబోజిన్ మాట్లాడలేదు. బగ్గీ ముందుకు సాగిపోయింది. బాధతో రగులుతున్న కిరిలోవ్ కూడా మళ్లీ మాట్లాడలేదు.

చలిగాలి దారంతా చీకటే. ఎక్కడో ఒక ఇంట్లో మినుకు మినుకుమంటున్న దీపం. రాళ్లూ, రప్పలూ, ఇరువక్కలా చిన్నచిన్న గుట్టలు. గుడ్డి వెలుతురు పంచుతున్న సన్నటి చంద్రవంక భర్త వదిలేసిన స్త్రీ గదిలో ఒంటరిగా కూర్చున్నట్టుగా, ప్రకృతి దిగులుగా వుంది. గడిచిపోయిన వసంతాన్నీ, గ్రీష్మాన్నీ గుర్తుచేసుకుంటూ పొంచివున్న శీతాకాలానికి వణుకుతున్నది నేల. నిస్సహాయంగా మృత్యువు వొడిలో తలదాచుకోవటానికి సిద్ధపడుతున్న ప్రకృతి.

ఇల్లు దగ్గిర పడుతున్నకొద్దీ అబోజిన్ ఆందోళన పెరిగింది. అంత చలిలోనూ భయంతో చెమటపట్టింది.


"నా భార్యకేదన్నా అయితే నేను బతకను" అంటూ బగ్గీలోంచి దూకాడు.

ఇంటినిండా దీపాలు. అయినా మనుషుల అలికిడి లేదు. డాక్టరు సన్నగా, పొడుగ్గా ఎండిన మోడులాగా. వసంతంతో పనితీరింది గనక ఎంత కాలమైనా అలాగే వుంటాడతను. కొడుకు శవాన్ని పెట్టుకొని ఒంటరిగా వుండగలిగిన భార్య కూడా వున్నది.

అబాజిన్ సంగతి వేరు. ముద్దుగా, బొద్దుగా వుంటాడు. ఖరీదైన దుస్తులూ, అందమైన మొహం. పెద్దమనిషి తరహా. మాటలో సౌమ్యత ఉంటుంది. మర్యాదపూర్వకమైన ఆయన ప్రవర్తన స్త్రీ సౌకుమార్యాన్ని గుర్తు చేస్తుంది.

**తలనొప్పా?**

రెండు టెన్నిస్ బంతులను ఒక సాక్‌లో వేసి కదలకుండా కట్టండి. నేల మీద వెల్లకిలా పడుకుని, మెడ భాగం నేలకు తగిలే చోట ఈ బంతులున్న సాక్‌ను పెట్టుకోండి. ఎంత త్వరగా నొప్పి పోతుందో గమనించండి.



"చడీ చప్పుడూ లేదు. ఇంత నిశ్శబ్దంగా వుందేమిటి?" అంటూ మేడపైకి చూస్తూ,

"ఒక్క నిమిషం కూర్చోండి డాక్టర్, నేను చూసి వస్తాను" అంటూ మెట్లెక్కాడు.

పెద్ద బంగళాను చూసి మురిసే దశలో కిరిలోవ్. కార్బాలిక్ ఆసిడ్ స్పర్శకు మండుతున్న చేతుల్ని చూసుకున్నాడు. ధనవంతుల ఇంట్లో వుండవలసిన హంగులన్నీ వున్నాయి.

పక్కగదిలో ఏదో కింద పడిన చప్పుడు నిశ్శబ్దాన్ని భంగం చేసింది. ఎందుకొచ్చినట్టు తనిక్కడికి?

ఎదురుగా గుమ్మంలో అబోజిన్. కాకపోతే తన దగ్గరకు వచ్చినప్పటి మనిషిలా లేడు. ఆ మొహంలో అభ్యర్థన, కృతజ్ఞత, భయం లేవు. ఏదో అసహ్యం, ద్వేషం, పగ, బాధ, అవమానం.

రెండు చేతుల్లోనూ మొహం దాచుకోవటానికి ప్రయత్నం చేస్తూ.

"నన్ను మోసం చేసింది. నయవంచకురాలు జబ్బుపడినట్టుగా నటించి, నన్ను మీ దగ్గరకు పంపి, అది అలెగ్జాండర్‌తో లేచిపోయింది." అంటూ ఏడ్చాడు.

"నేను దానికేం తక్కువ చేశానని? పువ్వుల్లో పెట్టి పూజించానే! అడిగిన కోరికలన్నీ తీర్చానే? ఇంకేం కావాలి దానికి? డాక్టర్, నాకెందుకీ శిక్ష?"

కన్నీరు ధార కట్టింది. పిచ్చివాడిలా నెత్తికొట్టుకున్నాడు. కిందపడి పొర్లాడు. బాధతో వంగిపోయి, ఒళ్లంతా రక్కుకున్నాడు.

లోకబాధలకు అతీతస్థితిలో వున్న డాక్టర్, "పేషెంటేదీ?" అని అడిగాడు నెమ్మదిగా.

"ఇంకెక్కడి పేషెంట్? పేషెంట్ కాదది. కామపిశాచి. నా కనుగప్పి లేచిపోయిన నీచురాలు. ఇంత మోసమా? ఇంత నీచత్వమా? టూ మచ్."

డాక్టర్ లేచి నిలుచున్నాడు. కన్నీళ్లుబుకుతున్నాయి.

"నా కొడుకు మరణించి గంట కాలేదు. నా భార్య అక్కడ లంకంత కొంపలో ఒంటరిగా వుంది. నాకు నిల్చునే ఓపిక లేదు. మూడురోజుల్నుంచీ నిద్రాహారాలు లేవు.

నా జీవితమింత ప్రహసనంగా, ఫార్సుగా తయారైందా? నేను జోకర్నా, బఫూన్‌నా? నాకేమీ అర్థం కావటం లేదు" అన్నాడు.

"నిజమే. నేనెవర్నో నాకు తెలియటం లేదు అన్నాడు" అబోజిన్.

వాడు రోజూ ఇంటికొచ్చేవాడు. కాని ఎప్పుడూ అనుమానం కలగలేదు. ఇవ్వాళ వాడో బండీ తీసుకుని వచ్చాడు. ఎందుకిది తెచ్చాడబ్బా అని అనుమానం కూడా రాలేదు నాకు.

కిరిలోవ్ బలహీనంగా.

"నాతో ఎందుకాడుకుంటున్నారు మీరు? మనిషి కష్టాలను చూసి నవ్వుకుంటారా? బాధను వెక్కిరిస్తారా? కన్నీళ్లను పరిహసిస్తారా? పసిపిల్లాడి శవం ఇంట్లో వున్నది. నేను మీకు విదూషకుడిలా కనిపిస్తున్నానా? మనిషివల్ల మనిషి ఇంత అవమానుషంగా ప్రవర్తించగలడా?"

ఘోర అవమానాన్ని భరించవలసి వచ్చినట్టుగా తలొంచుకొని కుర్చీలో కూలబడ్డాడు.

"దానికి మరొకడి మీద మనసు కలిగితే మాత్రం వెళ్లొద్దన్నానా? కాని... నన్ను మోసం చెయ్యటమెందుకు? నేను దానికంత ద్రోహమేం చేశాను, డాక్టర్? దానికేమవుతుందోననే భయంతోనే కదా మిమ్మల్నింత కష్టపెట్టాను! డాక్టర్‌గారూ, నన్ను నమ్మండి. అదంటే నాకు ప్రాణం. దానికోసం ఎన్ని త్యాగాలు చెయ్యలేదు? అడిగిందల్లా యిచ్చానే. నా వాళ్లను నాకు కాకుండా చేసుకున్నాను. ఆస్తంతా దానిపేరు మీద రాశాను. ఉద్యోగం మానేశాను. అది అడిగితే చందమామను తెచ్చి యిచ్చేవాడినే! నాలాంటి అమాయకుణ్ణి అదింత దారుణంగా ఎందుకు మోసం చేసింది డాక్టర్?" అబోజిన్‌కు కన్నీళ్లు ధారకట్టాయి. బాధతో వివశుడై వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

దాచుకోవలసింది ఏం మిగిలిందని? వివాహమైన మొదటిరాత్రినించి, తను డాక్టర్ కోసం బయల్దేరిన క్షణందాకా తమిద్దరిమధ్యా జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పాడు, మూడో మనిషి తెలుసుకోగూడని రహస్యాలన్నీ. గంట... రెండు గంటలు... కన్నీరాగదు. మాటలూ ఆగవు. అబోజిన్ బాధకు డాక్టర్‌లో సానుభూతి కలుగకపోలేదు. ఇప్పుడు చెయ్యగలిగిం దేముంది?... కాని అంతు తెగని అబోజన్ కష్టాలు డాక్టర్ కోపాన్ని పెంచాయి. చివరికి, అబోజిన్ భార్య ఫొటో చూపించి, "చూడండి, ఎంత అమాయకంగా వుంటుందా మొహం! ఇలాంటి మనిషి ఇంత ద్రోహం చెయ్యగలదని ఎవరన్నా వూహించగలరా?" అంటున్నప్పుడు.

కిరిలోవ్ చివాలున లేచి, కోపంగా చేయి విదిలిస్తూ, "ఎందుకివన్నీ చెబుతున్నావ్ నాకు? నీ వడకటింటి సరసాలు వినే ఓపిక లేదు నాకు. డామిట్! అవన్నీ చెప్పటానికి నీకు సిగ్గూ, శెరం లేకపోయినా, వినటానికి నాకు అవమానంగా వుంది. నీకెలా కనిపిస్తున్నాన్నేను? రంకు కబుర్లు విని చొంగ కార్చే లోఫర్ గాణ్ణా నేను?"

డాక్టర్ కోపానికి అబోజిన్ భయపడిపోయాడు.

"నీ పెళ్లితో నాకేం సంబంధం? నీ పెళ్లాం లేచిపోతే నాకేమిటి? ఒళ్లు కొవ్వెక్కి చేసుకుంటే అనుభవించు. నీ పెళ్లి పెడాకుల దొంగనాటకం నాకెందుకు? థూ! నామీద నాకే అసహ్యం వేస్తున్నది. అవమానంగా వున్నది. నీ డబ్బుల్ని చూసి గౌరవించాలా? నీ పెళ్లాన్ని చూసి జాలిపడాలా? నీ ప్రేమాయణం విని మురిసిపోవాలా? నా పరిస్థితిలో, నా బాధలో, నా విషాదంలో నన్ను తీసుకురావటానికి వచ్చిన నువ్వు మనిషివా? అసలు సాటిమనిషి బాధను గౌరవించగలిగిన సంస్కారం నీలో వుందా? నీ స్వంత కష్టానికి తప్ప మరెవ్వరి బాధకూ స్పందించలేని స్వార్థ, నీచ, జడ...."

"డాక్టర్, ఎందుకన్ని తిట్లు...."

"ఎందుకా? మనుషుల్తో ఆడుకునే వాళ్లు జంతువులకన్నా నీచులు. రాక్షసులకన్నా క్రూరులు. నేను డాక్టర్ని. రోగులకు జబ్బులు నయం చేసేవాణ్ణి, బూతు పురాణాలు వినే నీ చెంచాను కాను. నీ నోటి దురద తీరేదాకా నీ సెక్సు రహస్యాలన్నీ చెప్పుకో. వినేవాళ్లకు కాని ఎదుటి మనిషి బాధను కించపరిచే హక్కు నీకెవడిచ్చాడు?"

"నేను కించపరిచానా? నాకు బాధ లేదా?" అన్నాడు అబోజిన్.

డాక్టర్ కోపంగా టేబిల్‌మీద చరుస్తూ, "నన్నెందుకు తీసుకొచ్చావసలు? నీ బూతు కథలు వినటానికా?"

"అంటే నా బాధ నీకు పట్టదా డాక్టర్?" అన్నాడు అబోజిన్ తన పరిస్థితిని తానే నమ్మలేక.

"బాధ! ఆ మాటకి అర్థం నీకు తెలుసా అసలు? రోడ్డుమీది బికారులు ముష్టి దొరక్కపోతే బాధ పడతారు. తిన్నది అరగకపోయినా బాధ పడతారు కొందరు."

"డాక్టర్. స్టూపిడ్!" అబోజిన్ కోపంగా జేబులోంచి కరెన్సీ నోట్లు తీసి డాక్టర్ మీదికి విసిరేశాడు.

"తీసుకో, నీ ఫీజు!"

"నీ కథ వినటానికి డబ్బు తీసుకోవాలా? నాకు చేసిన అవమానానికి ఫీజు యిస్తావా?"

ఇద్దరూ తిట్టుకున్నారు. బాధ ఎదుటిమనిషి బాధను గుర్తించారు. ఆ సంతోషం వ్యక్తుల మధ్య దూరాన్ని పెంచుతుంది.

"సరే. నన్నింటికి పంపిస్తారా లేదా?"

అబోజిన్ కాలింగ్ బెల్ లాగాడు. ఎవరూ రాలేదు. ఈసారి కోపంగా లాగాడు. తాడు తెగి బెల్ కిందపడింది. పనిమనిషి వచ్చాడు.

"ఎక్కడ చచ్చావు అప్పట్నుంచీ? వెళ్లి బగ్గీ సిద్ధం చెయ్యమని చెప్పు. వెంటనే. ఆలస్యం కాకూడదు. ఊఁ వెళ్లు. కొవ్వెక్కిన వెధవలు. మిమ్మల్నందర్నీ రేపే డిస్మిస్ చేస్తాను."

అరుపులతో, తిట్లతో, కన్నీళ్లతో అబోజిన్‌ను తాత్కాలికంగా వుపశమనం కలిగినట్టే వుంది. డాక్టర్ కళ్లలో కోపం, అసహ్యం మాత్రం తగ్గలేదు.


బాధా తప్త హృదయంతోనే కిరిలోవ్ బగ్గీలో కూర్చున్నాడు. చీకటి మరింత చిక్కనైంది. ఇప్పుడు ఆకాశంలో చంద్రవంక లేదు.

మరొక బగ్గీలో అబోజిన్ పరిగెత్తి వస్తున్నాడు. కోపంతో చాలా మూర్ఖమైన పనులు చెయ్యాలనుకుంటున్నాడు.

దారిలో డాక్టర్‌కు భార్య జ్ఞాపకం రాలేదు. కొడుకూ జ్ఞాపకం రాలేదు. స్వంత బాధతో, విచక్షణాజ్ఞానం కోల్పోయి చెప్పుకోకూడని విషయాలన్నీ చెప్పుకున్నా అబోజిన్, లేచిపోయిన అబోజిన్ భార్య, లేపుకుపోయిన అలెగ్జాండర్ ఎంతమంది మీద కోపం తెచ్చుకోగలం? కోపం మనల్నీ బాధిస్తుంది.

కాలం ఆగదు. క్రమంగా కిరిలోవ్‌లో కూడా బాధా తీవ్రత తగ్గుతుంది. కాని ఈనాడు జరిగిన అవమానం మాత్రం అతణ్ణి జీవితాంతం వెంటాడుతూనే వుంటుంది.

■



### ఆపరేషన్ లేకుండా కళ్లకు చికిత్స

దృష్టి మెరుగయ్యేందుకు ఇటీవల లాసిక్ ఆపరేషన్ల సంఖ్య పెరుగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు 'సికె' అంటే 'కండక్టివ్ కెటరోప్లాస్టీ' అనే చికిత్స వచ్చింది. చత్వారం గలవారికి దీనితో కళ్లు యథాపూర్వస్థితికి వచ్చాయట. కళ్లజోడు అవసరం వుండదు. ఈ చికిత్స అయ్యాక రెండు మూడు రోజుల్లో పనుల్లోకి మామూలుగా వెళ్లొచ్చంటున్నారు యుఎస్ వైద్యనిపుణులు. త్వరలోనే దీన్ని జనానికి అందుబాటులో వుండే విధంగా చేస్తామంటున్నారు.